
సాక్షి
కర్నూలు
గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



రంగు మారింది!
ఆపదలో నేనున్నానంటూ వచ్చే 108 అంబులెన్స్‌లకు రంగు మారింది. ఇప్పుడు తెలుపు, ఎరుపు రంగు, అలాగే బ్యానెట్‌కు పసుపు రంగు వచ్చింది.
8లో▶



ఫీజు బకాయిలు చెల్లించాల్సిందే!
పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నాయకులు కోరారు. ఈనెల 21 నుంచి కళాశాలలను మూసివేస్తామన్నారు.
8లో▶



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,515
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,208

'లయ' తప్పని వైద్యం

- స్టెమీ ప్రోగ్రాంకు 2023లో ప్రాణం పోసిన ఆనాటి సీఎం వైఎస్ జగన్
- దీనిని తమ ఘనతగా చెప్పుకుంటున్న 'కూటమి' ప్రభుత్వం
- గుండెపోటు వచ్చిన వారికి ఉచితంగా రూ.40 వేల ఖరీదైన ఇంజెక్షన్లు
- సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, జీజీహెచ్‌లలో లభ్యం
- గుండెపోటు బాధితులను సకాలంలో ఆసుపత్రికి తీసుకొస్తే ఉపయోగం
- ప్రతి ఏటా వందలాది మందికి ఆయువు

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుండెశస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీలోకి చేర్చి ఎంతో మందికి ప్రాణం పోశారు. ఆయన తనయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గుండెపోటుకు గురైన వారికి వెంటనే ఖరీదైన ఇంజెక్షన్లు ఇచ్చే వైద్యాన్ని తీసుకొచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన స్టెమీ ప్రోగ్రామ్ ఇప్పటికీ కొనసాగుతూ అనేక మంది ప్రాణాలు నిలుపుతోంది. జిల్లాలోని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల్లోనూ ఈ ఖరీదైన ఇంజెక్షన్లు ఇస్తున్నారు.




కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా గుండెపోటుతో ఆకస్మిక మరణాలు అధికమయ్యాయి. ఒకప్పుడు వృద్ధుల్లో మాత్రమే కనిపించే ఈ గుండెపోటు మరణాలు ఇప్పుడు యువకుల్లోనూ అధికమయ్యాయి. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటి బాధితుల కోసం 2023 సెప్టెంబర్‌లో నేనున్నాంటూ అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ప్రోగ్రామ్‌ను తెచ్చారు. కేవలం నగర కేంద్రాల్లోని ఆసుపత్రుల్లోనే గాకుండా ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల్లో కూడా త్రాంబోలైసిస్ విధానంలో రూ.40వేల విలువ చేసే ఖరీదైన టెనిక్టమి ప్లేజ్ అనే ఇంజెక్షన్లు అందుబాటులో ఉండేటట్లు చేశారు. సీహెచ్‌సీలకు వచ్చిన రోగికి ముందుగా ఈసీజీ తీసి కర్నూలులోని టెలి మెడిసిన్ హబ్‌కు పంపిస్తారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ఈ ఇంజెక్షన్ ఇస్తున్నారు. గుండెపోటు వచ్చిన వారిని మొదటి గంటలోపు సమయానికి తీసుకొస్తే వెంటనే ఈ ఖరీదైన ఇంజెక్షన్ ఇచ్చి బతికిస్తున్నారు. రోగులకు భారం గాకుండా ఆరోగ్యశ్రీ పథకంలోనే దీనిని చేర్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో వందలాది మంది ప్రాణాలు పోసింది ఈ ఇంజెక్షన్.

కూటమి ప్రభుత్వం గొప్పలు

స్టెమీ ప్రోగ్రామ్‌ను తామే ప్రవేశపెట్టామని, దానిని ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో చేర్చి రోగులకు ఉచితంగా ఇస్తున్నామని కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. ఈ ప్రోగ్రామ్‌పై ఆ పార్టీ నాయకులతో పాటు పచ్చమీడియా సైతం ప్రచారం చేసుకుంటూ వస్తోంది. వాస్తవంగా ఈ ప్రోగ్రామ్ 2023లో అప్పటి వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అప్పట్లోనే దీనిని ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చి గుండె రోగుల ప్రాణాలు పోకుండా కాపాడుతోంది.



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీలో గుండెపోటు వచ్చిన ఓ రోగికి టెనెక్టమి ప్లేజ్ ఇంజెక్షన్ ఇస్తున్న వైద్యులు



టెనిక్టెమి ప్లేజ్ ఇంజెక్షన్ ఇవ్వక ముందు, ఇచ్చిన తర్వాత ఈసీజీలో మార్పులు

మూడేళ్లలో టెనిక్టమి ప్లేజ్ ఇంజెక్షన్ వివరాలు

ఆసుపత్రి	2023	2024	2025
ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రి	1	9	5
ఆలూరు సీహెచ్‌సీ	1	10	8
పత్తికొండ సీహెచ్‌సీ	3	20	26
ఓర్వకల్ సీహెచ్‌సీ	1	7	6
కోడుమూరు సీహెచ్‌సీ	3	14	11
వెల్దుర్తి సీహెచ్‌సీ	1	4	6
కర్నూలు జీజీహెచ్	25	59	55

నంద్యాల జిల్లాలో ఈ యేడాది ఇప్పటి వరకు 123 టెనిక్టమి ప్లేజ్ ఇంజెక్షన్లు ఇచ్చారు.

ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీల్లోనూ ఖరీదైన ఇంజెక్షన్లు



ఇటీవల కాలంలో చిన్న వయస్సు నుంచే దురలవాట్లు ఎక్కువయ్యాయి. దీనికితోడు మితిమీరిన ఆహారపు అలవాట్లు, సమయానికి తినకపోవడం, మద్యపానం, ధూమపానంతో స్థూలకాయ బాధితులు ఎక్కువయ్యారు. దీనివల్లే గుండెపై ఒత్తిడి అధికమవుతోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ గుండెపోటుతో మరణించేవారి సంఖ్య ఎక్కువైంది. ఇలాంటి వారు పెరగడంతో 2023లో స్టెమీ ప్రోగ్రామ్ ప్రారంభించి ఖరీదైన టెనిక్టమిప్లేజ్ అనే ఇంజెక్షన్లు ఇస్తున్నారు. ఇప్పటి నుంచి ఇప్పటి వరకు నిరంతరాయంగా వీటిని రోగులకు ఉచితంగా అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ఈ ఇంజెక్షన్ ఎంతో ఉపయోగపడుతోంది. వారి ప్రాణాలు పోకుండా కాపాడుతోంది.
–డాక్టర్ జఫ్రుల్లా, డీసీహెచ్ఎస్, కర్నూలు

ఉచితంగా ఇస్తున్నాం

ఆసుపత్రిలోని క్యాజువాలిటీ విభాగానికి ప్రతిరోజూ ఐదారుగురు గుండెపోటుతో చికిత్స కోసం వస్తుంటారు. వీరికి 2023లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రవేశపెట్టిన స్టెమీ ప్రోగ్రామ్ కింద దాదాపు రూ.40వేల ఖరీదైన టెనెక్టిప్లేజ్ ఇంజెక్షన్లు ఉచితంగా ఇస్తున్నాం. రెండు గంటల అబ్జర్వేషన్ తర్వాత కార్డియాలజీ విభాగానికి పంపిస్తున్నాం. గుండెపోటు వచ్చిన వెంటనే రెండు గంటలలోపు ఆసుపత్రికి రోగిని తీసుకువస్తేనే ఈ ఇంజెక్షన్ బాగా పనిచేస్తుంది. ఇటీవల కాలంలో ఎక్కువ శాతం 30 నుంచి 40 ఏళ్లలోపు వారే గుండెపోటుతో వస్తున్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే ఆలస్యం చేయకుండా ఆసుపత్రికి వస్తే ప్రాణాలు నిలిచే అవకాశం ఉంది.
– డాక్టర్ పి. సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎమర్జెన్సీ మెడిసిన్, జీజీహెచ్, కర్నూలు

న్యూస్‌రీల్

నేడు, రేపు ఉల్లి వేలంపాట

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఉల్లి పోటెత్తుతోంది. మార్కెట్‌లో ఎక్కడ చూసినా ఉల్లి దిగుబడులే కనిపిస్తున్నాయి. బుధవారం 14,896 క్వింటాళ్ల ఉల్లి వచ్చింది. ఇందులో వ్యాపారులు 8,465 క్వింటాళ్లు కొనుగోలు చేశారు. నాణ్యత లేదనే కారణంతో 6,431 క్వింటాళ్లు కొనుగోలు చేయలేదు. వీటిని మార్క్‌ఫెడ్ కొనుగోలు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. వ్యాపారులు క్వింటాకు కేవలం రూ.50 మాత్రమే ధర కోట్ చేయడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. కాగా మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిని ఈ నెల 18, 19 తేదీల్లో మార్కెట్ యార్డులో బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈ నేపథ్యంలో 18, 19 తేదీల్లో మార్కెట్ యార్డులో ఉల్లి క్రయవిక్రయాలు జరుగవని జేసీ తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రమణా రెడ్డి

వెల్దుర్తి: ఆర్థిక అక్షరాస్యతపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నట్లు డీఆర్‌డీఏ జిల్లా పీడీ రమణా రెడ్డి తెలిపారు. వెల్దుర్తిలోని స్త్రీశక్తి భవనంలో నిరక్షరాస్యులైన మహిళలకు చదువు చెప్పే మండల స్థాయి వలంటీర్ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన వలంటీర్ టీచర్లకు బోధన సామగ్రి అందజేశారు. జిల్లా వయోజన విద్య అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి ప్రతాప్, సూపర్‌వైజర్ రమణయ్య, వెలుగు సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నాల్గో విడత ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కాలేజీల్లో నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ బాలికల కాలేజీ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎల్.నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 27లోపు www.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28వ తేదీన వెరిఫికేషన్ చేసి, ప్రభుత్వ కాలేజీల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు 29వ తేదిన.. ప్రైవేటు కాలేజీల్లో దరఖాస్తు చేసుకున్న వారికి సంబంధిత కాలేజీల్లో 30వ తేదిన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ఉల్లి పంట పరిశీలనకు గ్రామ, మండల స్థాయి టీంలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సాగైన ఉల్లి పంట స్థితిగతులను పరిశీలించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసింది. గ్రామస్థాయిలో వీఆర్వో, రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జీలతో కమిటీలు ఏర్పాటయ్యాయి. మండల స్థాయిలో తహసీల్దారు, మండల వ్యవసాయ అధికారి, హార్టికల్చర్ ఆఫీసర్‌లతో టీంలు ఏర్పాటయ్యాయి. జిల్లాలో ఉద్యాన పంటల పరిస్థితి ఎలా ఉంది.. అధిక వర్షాలకు దెబ్బతినిందా.. ఇప్పటి వరకు ఎన్ని హెక్టార్లలో కోతకోశారు.. పొలాల్లో ఎంత ఉంది.. ఎకరాకు ఎన్ని క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.. వారానికి ఎన్ని టన్నులు మార్కెట్‌కు వస్తుంది తదితర వివరాలపై టీంలు సర్వే చేస్తాయి. గ్రామస్థాయి టీంలు చేసే సర్వేను మండల స్థాయి టీమ్‌లు పర్యవేక్షిస్తాయి. ఈ నెల 20వ తేదీలోపు సర్వే పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు రిపోర్టు ఇవ్వాలని జిల్లా ఉద్యాన అధికారి రాజాకృష్ణారెడ్డి గ్రామ, మండల స్థాయి టీంలను ఆదేశించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక

- అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె.శ్రీనాథ్‌రెడ్డి, బి.సతీష్



కే శ్రీనాథ్‌రెడ్డి



బీ సతీష్

కర్నూలు(అర్బన్): గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజనీర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటైంది. పర్యవేక్షక ఇంజనీరు సీహెచ్ మనోహర్, కర్నూలు, ఆదోని ఈఈలు అబ్దుల్‌ఖాదర్, ఎ.పద్మజ ఆధ్వర్యంలో జిల్లాలోని ఇంజనీర్లందరూ సమావేశమై నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా నూతన అధ్యక్షులుగా మంత్రాలయం డీఈఈ కె.శ్రీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కల్లూరు ఏఈఈ బి.సతీష్ ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎమ్మిగనూరు ఏఈఈ ప్రేమ్‌కుమార్, కోశాధికారిగా కర్నూలు డివిజన్ ఏఈఈ ఈకే హారిక, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా దేవనకొండ ఏఈ మురళీమోహన్, మహిళా విభాగం కార్యదర్శిగా కర్నూలు సర్కిల్ కార్యాలయం ఏఈ వి.వేద స్వరూపను ఎన్నుకున్నారు.

హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించండి



ఉమ్మడి జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులపై సమీక్షిస్తున్న లీలా వెంకటశేషాద్రి

కర్నూలు: ఉమ్మడి జిల్లాలో హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి సూచించారు. స్థానిక న్యాయ సేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై బుధవారం జిల్లాస్థాయి అధికారులతో మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 76 హిట్ అండ్ రన్ కేసులకు గాను 21 కేసుల్లో నష్టపరిహారం (అవార్డు) మంజూరైందని అధికారులు తెలిపారు. అలాగే నంద్యాల జిల్లాలో 37 హిట్ అండ్ రన్ కేసులకు గాను 11 కేసుల్లో నష్టపరిహారం మంజూరైందన్నారు. మిగతా వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేయాలని లీలా వెంకటశేషాద్రి అధికారులను ఆదేశించారు. కర్నూలు, నంద్యాల డీఆర్వోలు వెంకటనారాయణమ్మ, రాము నాయక్, ఆర్‌టీఓలు భరత్ చవాన్, శివారెడ్డి, డీటీఆర్‌బీ సీఐలు ఆదిలక్ష్మి, మల్లికార్జున, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ సంధ్యారెడ్డి, డీసీఆర్‌బీ ఎస్ఐ శ్రీనివాసరావు, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

డీపీఓలో వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ, పోలీసులు

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలో వాస్తు శిల్పి విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వకర్మను ప్రపంచంలోనే మొదటి వాస్తు శిల్పిగా భావిస్తారన్నారు. కష్టపడే తత్వం, పట్టుదల, నైపుణ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చనే శక్తివంతమైన సందేశాన్ని విశ్వకర్మ ద్వారా మనం నేర్చుకోవాలన్నారు. వివిధ వృత్తుల్లో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరి వెనుక ఉన్న ప్రేరణే విశ్వకర్మ అన్నారు. ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, ఆర్ఐలు జావెద్, నారాయణ, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

'19న చలో ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల'

- వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన, విద్యార్థి సంఘాల నాయకులు



విలేకరుల సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు (టౌన్): గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలను తీసుకువస్తే వాటిని ప్రైవేటీకరించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న యత్నాలను వ్యతిరేకిస్తున్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన, విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ఈనెల 19న చలో ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల పేరుతో శాంతి యుతంగా ఆదోని పట్టణంలో ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంత్ మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరిస్తే సామాన్య ప్రజలకు వైద్యం దూరం అవుతుందన్నారు.

మెడికల్ కౌన్సిల్‌కు లేఖ రాయడం సిగ్గుచేటు

రాష్ట్రంలోని 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణ కష్టమవుతుందని, వైద్య సీట్లు వద్దంటూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణిరెడ్డి, అధికార ప్రతినిధి కటికె గౌతమ్‌లు అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి పేరు వస్తుందనే అక్కసుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తున్నారని విమర్శించారు. ఏటా 20 లక్షల ఉద్యోగాలు అని చెప్పి 2 సంవత్సరాలు అవుతున్నా ఒక్క ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. ఈనెల 19 న జరిగే చలో ఆదోని కార్యక్రమానికి జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు, ప్రజలుల పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు. సమావేశంలో యువజన విభాగం నాయకులు దుర్గా ప్రసాద్ (పాణ్యం), వెంకటేష్ (కోడుమూరు), నజీర్ (ఎమ్మిగనూరు) అశోక్ రెడ్డి (పత్తికొండ), మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తాం



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజాకృష్ణారెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఉద్యాన పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని జిల్లా ఉద్యాన అధికారి రాజాకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం జిల్లా ఉద్యాన అధికారిగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న పి.రామాంజనేయులు పదోన్నతిపై చిత్తూరు జిల్లా ఆత్మ డీపీడీగా బదిలీ అయ్యారు. ఈ స్థానంలో అనంతపురం నగరపాలక సంస్థలో ఉద్యాన శాఖ ఏడీగా పనిచేస్తున్న రాజాకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈయన ఏపీఎంఐపీ అదనపు పీడీగా ఈ ఏడాది జూన్ 12వ తేదీ వరకు పనిచేశారు. తాజాగా జిల్లా ఉద్యాన అధికారిగా నియమితుల్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామని, పండ్లతోటల అభివృద్ధికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపడతామన్నారు. ఆయిల్‌పామ్ సాగులో పురోగతికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(సెంట్రల్): సంగీత వాయిద్య కళాకారులకు అవార్డులు ఇవ్వనున్నారని, ఇందు కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోస్టు ద్వారా ఇంటి నంబర్ 4-25-5, బాలాజీనగర్, కర్నూలు-518006 అనే చిరునామాకు అక్టోబర్ 10వ తదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఒక్క రూంలో ఆరుగురు ఎలా ఉంటారు?

- వీసీని కలసిన ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో హాస్టళ్లు అధ్వానంగా ఉన్నాయని, ఒక్క రూంలో ఆరుగురు ఎలా ఉంటారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు 30 మంది బుధవారం వీసీ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ బి. విజయ్‌కుమార్ నాయుడును కలిశారు. హాస్టళ్లలో మెనూ సరిగా పాటించడం లేదని, రూంలలో విద్యుత్ స్విచ్ బోర్డులు, విద్యుత్ తీగలు సరిగా లేవని చెప్పారు. హాస్టల్ కమిటీ సమావేశమై విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటుందని వీసీ, రిజిస్ట్రార్ విద్యార్థులకు హామీ ఇచ్చారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(అర్బన్): మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఏ క్యాంప్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన పోషణ్ మాహ్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మహిళల ఆరోగ్యం మెరుగుపడాలంటే కుటుంబ సభ్యులందరూ ఒకేసారి భోజనం చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ మాట్లాడుతూ పోషకాహార వినియోగంపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ ఏడాది చేపట్టే పోషన్ మాహ్ కార్యక్రమాలు అక్టోబర్ 16వ తేది వరకు కొనసాగుతాయన్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య గర్భిణిలకు శ్రీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ కర్నూలు ప్రాజెక్టు సీడీపీఓ అనురాధమ్మ, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రాజేశ్వరి, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కె.బాలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

25న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యవర్గ సమావేశం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు

కర్నూలు (టౌన్): స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో ఈనెల 25వ తేదీన వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ విభాగం ఇన్‌చార్జ్ ఉప్పల యోబు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు (కర్నూలు), తిరుపతయ్య (నంద్యాల) తెలిపారు. నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు. బుధవారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎస్సీ వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దళితులను రాజకీయంగా అభివృద్ధి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఎస్సీల సంక్షేమాన్నిన నీరుగార్చిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్లు అలంకారప్రాయంగా మారాయన్నారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నెమరకల వెంకటేష్, నగర అధ్యక్షుడు కమతం పరుశురామ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రభుదాసు, కార్యదర్శి కాశపోగు శ్రీకాంత్, శివ, కార్యవర్గ సభ్యులు పండు, వంశీ క్రిష్ణ, హరిప్రసాద్ పాల్గొన్నారు.



పొలం నిండా కన్నీళ్లే!

గిట్టుబాటు ధర లేక.. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే ఆశ లేక రైతులు ఉల్లి పంటపై ఆశలు వదులుకున్నారు. పంటను పీకి పొలంలోనే వదిలేస్తున్నారు. మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన కౌలు రైతు పెద్ద రంగన్న 15 రోజుల క్రితం ఉల్లి పంట పీకి పొలంలోనే వదిలేశాడు. ఐదు ఎకరాల్లో ఉల్లి సాగుచేస్తే రెండు ఎకరాల ఉల్లిని అరకొరగా విక్రయించడు. మిగిలిన మూడు ఎకరాల ఉల్లి పంటను గిట్టుబాటు ధర లేక పొలంలోనే వదిలేశాడు. పంట సాగుతో దాదాపు రూ.4 లక్షల వరకు నష్టం వచ్చినట్లు రైతు వాపోతున్నాడు.
– ఎమ్మిగనూరు రూరల్

క్లుప్తంగా

తప్పిన ప్రమాదం



కూలిన మిద్దెను చూపుతున్న బాధితురాలు మాధవి

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎస్. బోయనపల్లె గ్రామానికి చెందిన కుంటల పెద్ద ఎల్లయ్య, మాధవి దంపతుల మట్టి మిద్దె ఇటీవల వర్షాలకు మెత్తబడి మంగళవారం అర్ధరాత్రి సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు బయట వరండాలో నిద్రిస్తుండటంతో ప్రాణాపాయం తప్పింది. మిద్దెకూలడంతో వంటసామగ్రి, సరుకులకు నష్టం జరిగినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. ప్రభుత్వం ఆదుకుని నష్ట పరిహారం అందించి, గృహం మంజూరు చేయాలని వారు కోరారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్యాపిలి: మండలకేంద్రం ప్యాపిలి పీహెచ్‌సీ సమీపంలో నివసిస్తున్న భాస్కర్ (41)అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయేన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసగా మారాడు. రోజురోజుకూ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురై బుధవారం రాత్రి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య గాయత్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి తండ్రి పెద్ద బందయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ప్యాపిలి పోలీసులు తెలిపారు.

ఆంధ్రా యువసంకల్ప్‌లో పాల్గొనండి

కర్నూలు (హాస్పిటల్): ఆంధ్రా యువ సంకల్ప్ 2కే 25 అనే కార్యక్రమంలో యువత పాల్గొనాలని యువజన సర్వీసుల శాఖ అధికారి డాక్టర్ కె. వేణుగోపాల్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. యువతలో ప్రేరణాత్మకమైన భావాలను, వారిలోని సృజనాత్మకతను, సాంకేతిక నైపుణ్యతను గుర్తించేందుకు ప్రపంచ యువ దినోత్సవం సందర్భంగా మూడు రకాలైన అంశాలపై వీడియోలు, షార్ట్ ఫిలిమ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ వీడియోలు, షార్ట్ ఫిలిమ్‌లు 120 సెకండ్లకు మించకుండా రూపొందించాలన్నారు. ఇందులో యూత్ రెస్పాన్సిబులిటీస్, ఫిట్ యూత్ ఏపీ, స్మార్ట్ యూత్ ఏపీ అనే అంశాలు ఉంటాయన్నారు. వీడియోలను, షార్ట్ ఫిలిమ్‌లను రూపొందించి వాటిని www.andhrayuvasankalp.com అనే వెబ్‌సైట్‌లో పోస్ట్ చేసి వారి వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ విధంగా రూపొందించిన వీడియోల నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిర్ణయించి రూ.లక్ష, రూ.75 వేలు, రూ.50 వేలు నగదు రూపంలో బహుమతులు అందజేస్తావన్నారు. ఈ విజేతలను ఆంధ్రా యూత్ బ్రాండ్ అంబాసిడర్ 2కే25గా నిర్ణయిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రతి పాఠశాల, కళాశాలల విద్యార్థులు, యువజనులు, యువజన సంఘాల సభ్యులు, వీడియోలను రూపొందించి ఈనెల 30వ తేదీలోగా పోస్ట్ చేయాలన్నారు.

నల్లమల ఘాట్‌లో ఆర్టీసీ బస్సు, కారు ఢీ

మహానంది: నంద్యాల గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో బుధవారం రెండు వాహనాలు ఎదురెదురై ఢీకొన్నాయి. వివరాల్లోకి వెళితే.. నంద్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు, గిద్దలూరు వైపు వెళ్తున్న కారు రెండూ బొగద వంతెన దిమ్మెల మలుపు సమీపంలో ఢీకొన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా వాహనాలు ఢీకొన్న సంఘటనలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంట పాటు వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి వాహనాల రాకపోకలు సాగేలా చర్యలు తీసుకున్నారు.

ఉల్లి..కుళ్లి



మార్కెట్ యార్డులో పేరుకుపోయిన ఉల్లి నిల్వలు

- మార్కెట్‌యార్డులో ఎవ్వరూ పట్టించుకోని ఉల్లి 1500 క్వింటాళ్ల పైనే

కర్నూలు(అగ్రికల్చర్):కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో ఉల్లిగడ్డలు కుళ్లి నీళ్లారుతున్నాయి.మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లిని ఈ నెల 16న వేలం వేయగా 1500 క్వింటాళ్ల ఉల్లి మిగిలిపోయింది. దీనిని ఎవ్వరూ కొనకపోవడం.. రోజుల తరబడి ఉల్లి సంచుల్లో ఉండటంతో కుళ్లిపోయి నీళ్లు కక్కుతోంది. వర్షాలు పడినప్పుడు ఎలా చిత్తడిగా ఉంటుందో ఉల్లి నిల్వ షెడ్ల వద్ద పరిస్థితి అలా ఉంది. వీటిపక్కన రైతులు ఉల్లిగడ్డలు తెచ్చి అమ్మకానికి పెట్టారు.కుళ్లిన గడ్డల ప్రభావం తాజా ఉల్లిపై పడే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే కుళ్లిన ఉల్లితో మార్కెట్ యార్డు అంతా దుర్గంధం వెదజల్లుతున్నా మార్కెట్ కమిటీ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు వాటిని డంప్‌యార్డుకు తరలించే చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది.



ఉల్లి కుళ్లిపోయి నీళ్లూరుతున్న దృశ్యం

విద్యుత్ శాఖ ఎస్ఈకి చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి



ఎం.ఉమాపతి

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ కర్నూలు సర్కిల్(ఆపరేషన్) సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎం.ఉమాపతికి పదోన్నతి లభించింది. చీఫ్ ఇంజనీర్‌గా (సీఈ) పదోన్నతి కల్పిస్తూ ఏపీఎస్పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పదోన్నతిపై ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ స్థానంలో కూడా ఎవరినీ నియమించలేదు. ఈయన మూడేళ్లకు పైగా ఇక్కడ ఎస్ఈగా పని చేశారు.

ఫీజు బకాయిలు చెల్లించాల్సిందే!

- లేని పక్షంలో ఈనెల 21 నుంచి కళాశాలల మూసివేస్తాం
- ఆర్‌యూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు



వీసీకి వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌యూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు కల్చరల్: డిగ్రీ కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని లేని పక్షంలో ఈనెల 21 నుంచి కళాశాలల మూసివేస్తామని రాయలసీమ యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. బుధవారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావుకు వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలోని సుమారు 86 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు సంబంధించి రూ. 350 కోట్లు బకాయి ఉందని ఇప్పటి వరకు ఒక్క రూపాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదని వాపోయారు. 2023 నుంచి 2025 ఏడాది వరకు పెండింగ్ ఆర్టీఎఫ్ నిధులను వెంటనే విడుదల చేయాలని, డిగ్రీ ఫీజులను సవరించి, కొత్త ఫీజుల విధానాన్ని వర్సిటీలకు అప్పగించాలని, డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల్లో నెలకొన్న అక్రమాలు, గందరగోళాన్ని తొలగించాలని, కళాశాలలకు అఫ్లియేషన్‌ను వార్షికంగా కాకుండా 5 ఏళ్లకు ఒకసారి ఇవ్వాలని, ప్రతి ఏడాది అకడమిక్ క్యాలెండర్ విడుదల చేసి కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ యూనివర్సిటీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్ఎస్ శౌరిల్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు వేణుగోపాలాచారి, కోశాధికారి కె.రమణారెడ్డి, ఏపీ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి గుర్రాల వెంకట రెడ్డి, జాయింట్ సెక్రటరీ రమేష్, స్టేట్ రీజినల్ కోఆర్డినేటర్ వెంకట మాధవ్, తదితరులు వీసీ వెంకట బసవరావు, రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడులకు వినతి పత్రం అందజేసినవారిలో ఉన్నారు.

విద్యార్థిపై చెప్పుతో దాడి

- మంత్రాలయంలో గ్లోబల్ జీనియస్ స్కూలు బస్సు డ్రైవర్ నిర్వాకం
- నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిన స్కూలు ఏఓ
- ఆగ్రహం వ్యక్తం చేసిన తల్లిదండ్రులు



చెంపకు రక్తపు గాయంతో విద్యార్థి అయాన్

మంత్రాలయం: బడికెళ్లే సమయంలో చిన్న పిల్లలు గోము చేయడం షరా మామూలే. ఏడ్చుకుంటూ బస్సు ఎక్కిన పిల్లోడిని నచ్చజెప్పాల్సింది పోయి ఓ స్కూలు బస్సు డ్రైవర్ విచక్షణ మరచి కర్కశంగా వ్యవహరించాడు. ఏకంగా విద్యార్థి చెంపపై, తలపై చెప్పుతో బాది గాయపరిచాడు. వివరాల్లోకి వెళితే.. మంత్రాలయం మండల కేంద్రంలోని పాతూరుకు చెందిన మహబూబ్ బాషా,రియాన దంపతుల మొదటి కుమారుడు అయాన్ స్థానిక గ్లోబల్ జీనియస్ ఇంగ్లిస్ మీడియం స్కూలులో ఎల్‌కేజీ చదువుతున్నాడు. రోజు మాదిరే బుధవారం స్కూలు బస్సు రాగానే కుమారుడిని తల్లి బస్సు ఎక్కించింది. ఆ సమయంలో అయాన్ ఏడుస్తూ బస్సు ఎక్కాడు. ఆగ్రహించిన డ్రైవర్ నరేష్.. చిన్నోడు అని చూడకుండా విచక్షణ రహితంగా చెప్పుతో బస్సులో బలంగా కొట్టడంతో ఆ చిన్నారి చెంపకు, తలకు ముందు భాగంలో కందిన గాయాలయ్యాయి. చెంపపై రక్తం చిందేంతగా కొట్టాడు. తప్పు చేయడమే కాక చిన్నారి తండ్రి మహబూబ్‌బాషాకు ఫోన్ చేసి మీ పిల్లోడు ఏడుస్తుంటే కాస్త మందలించాని, చిన్నగా కొట్టానని చెప్పాడు. అనుమానం వచ్చిన తండ్రి మహబూబ్ బాషా స్కూలు దగ్గరకు వెళ్లి చూడగా కందిన గాయాలు కావడంతో ఆందోళనకు గురయ్యాడు. చిన్నారిని బాదడంపై పాఠశాల ఏఓ రఘువీరను అడుగగా ఆయన కూడా నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. ఇలాంటివి మామూలే.. మీరే సర్దుకుపోవాలంటూ బదులిచ్చాడు. దీంతో తల్లిదండ్రులు చేసేదేమి లేక చిన్నారిని శ్రీమఠం హస్పిటల్‌కు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. నరాలు చిట్లి ఉంటే కష్టమని డాక్టర్లు తల్లిదండ్రులకు చెప్పారు. ఇంతగా విద్యార్థి గాయపడినా పాఠశాల ఏవో నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులను ఎంతో శ్రద్ధగా చూసుకోవాల్సిన ప్రైవేటు స్కూలు యాజమాన్యం ఇలా ప్రవర్తించడం సరికాదని మండిపడుతున్నారు. విద్యార్థినిని చిదకబాదిన డ్రైవర్, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌యూలో రక్తదానం



రక్తదానం చేస్తున్న ఫ్యాకల్టీకి సర్టిఫికెట్ అందజేస్తున్న వీసీ వెంకట బసవరావు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో వర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన్ అమృత్ మహోత్సవ్ 2.0 కార్యక్రమంలో భాగంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ప్రారంభించారు. 27 మంది రక్తదానం చేయగా, 167 మంది బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేయించుకున్నట్లు వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ వెంకట రత్నం, డాక్టర్ బి.విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ ఆఫీసర్ డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడుకోవాలి

- పశుసంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకులు శ్రీనివాసరావు



పశువైద్యశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఉప సంచాలకులు శ్రీనివాసరావు

పగిడ్యాల: వ్యాధుల బారిన పడకుండా పశు సంపదను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా ఉప సంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని పాత ముచ్చుమర్రి పశువైద్యశాల, నెహ్రూనగర్ గ్రామీణ పశువైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులను పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమ అభివృద్ధి చెందాలని, దీనిపై రైతుల్లో అవగాహన పెంచాలన్నారు. మేలు జాతి పాడి గేదెలు, ఆవుల ద్వారా అధిక లాభాలు ఉన్నాయన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం కింద ప్రస్తుతం పశువులకు గాలి కుంటు సోకకుండా టీకాలు వేస్తున్నట్లు చెప్పారు. పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా గాలికుంటురోగంతో పశువులు మృతి చెందే ప్రమాదం ఉందన్నారు. ఈయన వెంట జూపాడుబంగ్లా డివిజన్ సహాయ సంచాలకులు రామాంజి నాయక్, డాక్టర్ రాగసంధ్య, వీఎల్‌ఓ శ్రీనివాసులు, ఏహెచ్‌ఏ చరిత, ఓఎస్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు



గౌరవాధ్యక్షురాలు బి. రాధికకు బొకే అందిస్తున్న అసోసియేషన్ నేతలు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలకు చెందిన ఉద్యోగులందరు వారి సంక్షేమం కోసం నూతనంగా వెల్ఫేర్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం ఆయా శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులందరు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సమావేశమై అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని కూడా ఎన్నుకున్నారు. ఆయా శాఖలకు చెందిన జిల్లా అధికారులను గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అలాగే అధ్యక్షులుగా కర్నూలు సాంఘిక సంక్షేమ సహాయ అధికారి బి. మద్దిలేటి, ప్రధాన కార్యదర్శిగా బీసీ వసతి గృహ సంక్షేమాధికారి పి. శ్రీనివాసులు, కోశాధికారిగా ట్రైబల్ హెచ్‌డబ్ల్యూఓ ఎం. ఓబులేసును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలోనే అసోసియేట్ ప్రెసిడెంట్లుగా కె. బాబు (ఏఎస్‌డబ్ల్యూఓ పత్తికొండ),ఎం శ్రీనివాసులు (ఏబీసీడబ్ల్యూఓ ఎమ్మిగనూరు), టి. ఆంజనేయులు నాయక్ (ఏబీసీడబ్ల్యూఓ కర్నూలు అర్బన్), ఎస్ లీలావతి (ఏఎస్‌డబ్ల్యూఓ కోడుమూరు), పి. మాదప్ప (ఏబీసీడబ్ల్యూఓ ఆదోని) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా వసతి గృహ సంక్షేమాధికారులు జి. రాముడు, పి. సత్యనారాయణరాజు, జి. సుంకన్న, డీసీ మదారి, ఎం. నాగమద్దయ్యతో పాటు కార్యాలయ పర్యవేక్షకులు పి. మనోహర్ ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా పర్యవేక్షకులు ఎస్ ఆలీబాషా, హెచ్‌డబ్ల్యూఓలు యు. కల్పన, సి. విశ్వనాథరెడ్డి, కె. రాజశేఖర్‌రెడ్డి, సి. సిద్దప్ప, పి. సుంకన్న, సంయుక్త కార్యదర్శులుగా కె. హారతీదేవి, జి. రవికుమార్, ఇమ్మానుయేల్, కె. రంగస్వామి, బి. బెన్నమ్మ, ఎస్ వెంకటరాముడుతో పాటు 13 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

మీ ఇళ్లకు కూడా తాళాలు వేయకుండా వెళ్తారా?

- నెహ్రూనగర్ సచివాలయ సిబ్బందిపై డీఎల్‌డీఓ ఆగ్రహం

సాక్షి ఎఫెక్ట్



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్‌డీఓ అన్వరాబేగం

పగిడ్యాల: జవాబుదారితనం లేకుండా విధులు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదని డీఎల్‌డీఓ అన్వరా బేగం నెహ్రూనగర్ గ్రామ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. ఈనెల 15వ తేదీన సచివాలయానికి తాళం వేయకుండా ఉద్యోగులు ఇళ్లకు వెళ్లారు. ఈ విషయాన్ని 'సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం' అనే శీర్షికన 'సాక్షి' వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనంపై డీఎల్‌డీఓ స్పందించి బుధవారం ఆ గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ప్రభుత్వ ఆస్తులు అంటే తమాషాగా ఉందా అంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇళ్లను కూడా ఇలాగే తాళాలు వేయకుండా వదిలేసి వెళ్తారా అని మండిపడ్డారు. విధుల నిర్వహణలో జవాబుదారిగా ఉండాలని, ఇలాంటి ఘటన మళ్లీ పునరావృతమైతే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సమయపాలన పాటించాలని ఇష్టారాజ్యంగా విధులకు హాజరైతే సహించేది లేదని పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులను మందలించారు. ఆమె వెంట ఎంపీడీఓ నాగేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

ఇద్దరు పోలీసులకు టీచర్ ఉద్యోగాలు



టీచర్ పోస్టు సాధించిన కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం

నందికొట్కూరు: ఇద్దరు పోలీసులు టీచర్ ఉద్యోగాలు సాధించారు. బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఎం. జ్యోతి, పగిడ్యాల మండలం పరిధిలోని ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఎస్. నాగమల్లయ్య డీఎస్సీకి ప్రిపేర్ అయి ఎస్‌జీటీ పోస్టులు సాధించారు. ఈ నేపథ్యంలో నందికొట్కూరు సర్కిల్ రూరల్ సీఐ సుబ్రమణ్యం ఆ ఇద్దరిని కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. పిల్లలకు బాగా చదువు చెప్పి మంచి టీచర్లుగా పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

బైక్ జాతాను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరాయుడు

డోన్ టౌన్: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ జాతాను విజయవంతం చేయాలని ఆ నంద్యాల జిల్లా గౌరవ అధ్యక్షుడు సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. ఈనెల 19వ తేది బైక్ జాతా డోన్‌కు చేరుకుంటుందన్నారు. బుధవారం డోన్‌లోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలన్నారు. ఈ డిమాండ్ల పరిష్కారంలో కూటమి సర్కారు నిర్లక్ష్యంగా వ్యహరిస్తే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాబు, కేశవరెడ్డి, రామమూర్తి, గోపాల్, అబ్దుల్ లతీఫ్, రమేష్ నాయుడు,అంజనప్ప, చంద్రమోహన్, శ్రీనివాసరెడ్డి, మధు, కృష్ణనాయక్, కుళ్లాయప్ప, సంజీవరాయుడు, బాలరంగారెడ్డి, రవిచంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల అభివృద్ధిపై దృష్టి సారించండి

- సాంకేతిక సహాయకులకు డ్వామా పీడీ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరమణయ్య

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో పండ్లతోటల అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పండ్ల మొక్కలు నాటించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని డ్వామా సమావేశ మందిరంలో ఎమ్మిగనూరు, కర్నూలు, పత్తికొండ క్లస్టర్ల పరిధిలోని సాంకేతిక ఉపాధికి చెందిన సహాయ సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ మండలాల వారీగా పండ్ల తోటల టార్గెట్ ఎంత.. ఇప్పటి వరకు సాధించిన ప్రగతి తదితర వాటిపై సమీక్షించారు. వివిధ మండలాల్లో పురోగతి తక్కువగా ఉండటంతో సంబంధిత టీఏలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఈ ఏడాది 4500 ఎకరాల్లో ఉపాధి నిధులతో వందశాతం సబ్సిడీతో పండ్లతోటలు అభివృద్ధి చేయాలనేది లక్ష్యమని, ఇప్పటి వరకు 4220 ఎకరాలకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారని తెలిపారు. ఇందులో 3800 ఎకరాల్లో ప్లాంటేషన్ కూడ పూర్తి అయిందని పేర్కొన్నారు. మిగతాది ఈ నెల చివరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఫాం పాండ్స్ తవ్వకాల్లో 50 శాతం కూడా ప్రగతి లేదని పేర్కొన్నారు. ఉపాధి కూలీల యావరేజ్ వేజ్ రేటును రూ. 300కు పెంచాలని పేర్కొన్నారు. అదనపు పీడీ మాధవీలత, ప్లాంటేషన్ మేనేజర్ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం



మృతి చెందిన మహావీర్

నంద్యాల అర్బన్: మండల పరిధిలోని అంబాడం తండా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నంద్యాలకు చెందిన ఈ విద్యార్థులు బుధవారం రాత్రి మహానంది వైపు నుంచి బైక్‌పై వస్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొంది. ఈ ఘటనలో కె. మహావీర్ అనే విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా సూర్యప్రకాష్ అనే విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి క్షతగాత్రుడిని 108లో నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువురు పట్టణంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ విద్యాసంస్థలో పదోతరగతి చదువుతున్నట్లు సమాచారం.విషయం తెలుసుకున్న నంద్యాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలి

దొర్నిపాడు:ఈ–క్రాప్ నమోదును వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి సూచించారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ–క్రాప్ నమోదు ఎంత వరకు వచ్చిందని ఆరాతీశారు. పంట నమోదుతోనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. రైతులు వ్యవసాయాధికారులకు సహకరించి నమోదు చేసుకోవాలని సూచించారు. మండలంలో సాగుచేసిన పంటలు, వాటి పరిస్థితిపై ఆరా తీశారు. వర్షాలకు ఏమైనా పంటలు దెబ్బతిన్నట్లయితే పంటలు మాములు స్థితిలోకి వచ్చేలా చర్యలు తీసుకొని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సుధాకర్, మండల వ్యవసాయాధికారి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియమాకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, మ్యాథ్స్ బోధించేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 19వ తేదీ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరై డెమో క్లాసు ఇవ్వాలన్నారు.నియామకాల్లో ఏపీ సెట్, నెట్, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

రంగు మారింది!



రంగులు మారిన 108 అంబులెన్స్‌లు



ఆపదలో నేనున్నానంటూ కుయ్ కుయ్ మంటూ నిమిషాల్లో చేరుకునే 108 అంబులెన్స్‌లకు రంగు మారింది. కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చాక గతంలో పనిచేసిన సంస్థ ఈ సేవల నుంచి దూరమైంది. దాని స్థానంలో భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ బాధ్యతలు తీసుకుంది. కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 30 108 వాహనాలు ఉన్నాయి. ఇందులో ఆదోని, నంద్యాలలో నియోనేటల్ వాహనాలు కూడా పనిచేస్తున్నాయి. గతంలో ఈ వాహనాలకు ఆకుపచ్చ రంగు మిలితమై ఉండగా ఇప్పుడు తెలుపు, ఎరుపు రంగు వెనుక భాగంలో బ్యానెట్‌కు పసుపుతో రంగులు మార్చారు. రోజూ కొన్ని వాహనాలను రంగులు మార్చేందుకు పంపుతుండటంతో ఆయా స్థానాల్లో అంబులెన్స్ సేవల్లో జాప్యం ఏర్పడుతోంది. కాగా గతంలో పార్టీ రంగులు ఎలా వేస్తారని ప్రశ్నించిన తెలుగుదేశం నాయకులు ఇప్పుడు చేస్తున్నదేమిటనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

–కర్నూలు(హాస్పిటల్)